క్లుప్తంగా

శేషవాహనంపై చెన్నకేశవస్వామి



శేషవాహనంపై దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు బుధవారం రాత్రి శేషవాహనంపై పట్టణ వీధుల్లో విహరించారు. ఉదయం స్వామి అమ్మ వార్లకు అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై ఆశీనులను చేసి కర్పూర నీరాజనాలు పలికారు. మేళతాళాల నడుమ గౌరిపేట, పాత తహసీల్దార్ కార్యాలయం, సుబ్బారెడ్డి నగర్, సుద్దబావి, కూరగాయల మార్కెట్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ సుజాత శర్మ, కమిటీ సభ్యులు హుసేన్‌రెడ్డి, మారుతి శర్మ, సుధాకర్‌రెడ్డి, రమణ, శ్రీను పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.71వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లి: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి బుధవారం నందవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి కోటేశ్వరరెడ్డి కుమార్తె శివమ్మ కుటుంబ సభ్యులు రూ.71 వేల విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు నగదు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ ఇంజిన్ చోరీ

కొలిమిగుండ్ల: నాగిరెట్టిపల్లె సమీపంలోని రైస్ మిల్‌లో ఉన్న ట్రాక్టర్ ఇంజిన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీ చేశారు. సంజామల మండలం పేరుసోములకు చెందిన సంద్యపాకుల దస్తగిరిమ్మకు చెందిన ట్రాక్టర్ ఇంజిన్‌ను రైస్‌మిల్ వద్ద ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరూ లేని సమయం చూసి గుట్టు చప్పుడు కాకుండా అపహరించారు. మిల్ వద్దకు వెళ్లి చూసే సరికి ఇంజిన్ కనిపించకుండా పోయింది. దీంతో కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది.

శక్తియాప్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కోవెలకుంట్ల: ఆడపిల్లలు, మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. చిన్నారులు, మహిళల రక్షణ కోసం పోలీస్‌శాఖ శక్తియాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ యాప్ ఉంటే నిరంతరం ఓ సోదరుడు తోడుగా ఉన్నట్లేనన్నారు. ఆపదలో ఉన్న మహిళలు యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే సెకన్లలో రికార్డయి రక్షణ కల్పిస్తుందన్నారు. యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు అనవసర యాప్‌లు, గేమ్‌ల జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. హెచ్‌ఎం గీతా, ఉపాధ్యాయులు రోజా, బాల పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని నూర్‌షావలి దర్గా సమీపంలో కుందూనది ఒడ్డున బుధవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.15,100 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నాటుసారా ధ్వంసం



సారా ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఎక్సైజ్ శాఖ పరిధిలో సీజ్ చేసిన నాటుసారాను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి బుధవారం తెలిపారు. మొత్తం 63 కేసుల్లో సీజ్ చేసిన 2,144 లీటర్ల నాటుసారాను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని స్థానిక ఎస్సార్‌బీసీ కాల్వ సమీపంలో ధ్వంసం చేశారు.

చివరికి మిగిలింది కన్నీళ్లే

- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు
- రబీలో వరి రైతులను వెంటాడిన కష్టాలు
- ప్రారంభమైన వరి కోత, నూర్పిడి పనులు
- ఎకరాకు 38 నుంచి 40 బస్తాల దిగుబడులు
- వేధిస్తున్న గిట్టుబాటు ధర





కోవెలకుంట్ల మండలం భీమునిపాడు వద్ద యంత్రంతో వరి నూర్పిడి, ధాన్యం ఆరబోస్తున్న రైతులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీసీజన్‌లో వరి రైతులను వరుస కష్టాలు వెంటాడాయి. సాగునీరు, చీడపీడలు, అకాల వర్షాల బారినుంచి పంటను కాపాడుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలు ఎదుర్కొన్నారు. అన్ని కష్టాలను అధిగమించి చివరకు ధాన్యాన్ని దక్కించుకున్నారు. బోర్లు, బావులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 8,987 ఎకరాల్లో వరి సాగైంది. రైతులు కర్నూలు, నంద్యాల సోనా, 555, షుగర్‌లెస్ రకాలకు చెందిన వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికందడంతో కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

గణనీయంగా పెరిగిన పెట్టుబడులు

ఈ దఫా వరిలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. వరినారు, నాట్లు, కలుపు నివారణ, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర ఖర్చుల రూపంలో ఎకరాకు రూ. 35 వేల నుంచి రూ. 40 వేలు వెచ్చించారు. వేసవి కాలం కావడంతో పైరు చేతికందే తరుణంలో కుందర వాగు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు నీటి విడుదల నిలిచిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు వెచ్చించామని, మరో నెల రోజులపాటు వాగు, కాల్వలకు నీటిని విడుదల చేయాలని రైతులు అధికారులను పలుమార్లు విన్నవించుకోగా రెండు పర్యాయాలు సాగునీటిని విడుదల చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరికి దోమపోటు, అగ్గి తెగులు ఆశించడంతో తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు అదనంగా క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాల్సి వచ్చి అదనపు భారం పడింది. తీరా పైరు కోత దశకు చేరుకున్న తరుణంలో అకాల వర్షాలు వెంటాడాయి. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు వర్షాలు కురిసి పైరు నేలవాలి వడ్లు రాలిపోయాయి. వీటన్నింటిని దాటి రైతులు ధాన్యాన్ని దక్కించుకున్నారు. ఆయా మండలాల్లో వరిని యంత్రాల సాయంతో నూర్పిడి చేయిస్తున్నారు. దిగుబడులను పొలాలు, కల్లాల్లో ఆరబోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎకరాకు 38 నుంచి 40 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎకరాకు 42 నుంచి 45 బస్తాల దిగుబడులు వచ్చాయని, ప్రస్తుత రబీ సీజన్‌లో సాగైన వరిలో 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గిట్టుబాటు ధర లేక ఆవేదన

అష్టకష్టాలు పడి పంటను దక్కించుకున్నా మార్కెట్‌లో గిట్టుబాటు ధర వేధిస్తోంది. ఖరీఫ్‌లో బస్తా రూ. 1,500 లోపే పలికింది. ప్రస్తుత మార్కెట్‌లో ధర అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తా రూ. 1,200 మాత్రమే పలుకుతుండడంతో ఈ ధరకు విక్రయిస్తే చేసిన కష్టమంతా పెట్టుబడులకే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. రబీ సీజన్‌లో పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు వెచ్చించామని, బస్తా రూ. 1,800 ధర పలికితే తప్ప గిట్టుబాటు కాదని రైతులంటున్నారు. కూటమి ప్రభుత్వం వరికి మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి రైతులను గట్టెక్కించాలని కోరుతున్నారు.

కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో వరిసాగు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
కోవెలకుంట్ల	1,813
సంజామల	609
అవుకు	3,880
ఉయ్యాలవాడ	1903
దొర్నిపాడు	740
కొలిమిగుండ్ల	42
మొత్తం	8987

దిగుబడి తగ్గింది



ఈ ఏడాది రబీ సీజన్‌లో 2.60 ఎకరాల సొంత పొలంలో షుగర్‌లెస్ రకానికి చెందిన వరి సాగు చేశాను. వరినారు, నాట్లు, కలుపు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో రూ. 1.02 లక్షలు వెచ్చించాను. ఖరీఫ్‌లో సీజన్‌లో ఎకరాకు 45 బస్తాల దిగుబడులు రాగా ఎండకారు వరిసాగులో 40 బస్తాల దిగుబడులు వచ్చాయి.

–వెంకటసుబ్బారెడ్డి, రైతు, కలుగొట్ల, కోవెలకుంట్ల

క్వింటాకు రూ. 2వేలు కల్పించాలి



ఈ ఏడాది వరికి ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేదు. రెండుకార్ల పంటలసాగుకు ఎకరాకు 13 బస్తాల వడ్లు కౌలురూపంలో చెల్లించేలా 9 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాను. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు పెట్టాను. పంట చేతికందడంతో నూర్పిడి చేసి కల్లంలో ఆరబోసుకున్నాను. ప్రస్తుత మార్కెట్‌లో బస్తా రూ. 1,200 పలుకుతోంది. ప్రభుత్వం క్వింటాకు రూ. 2వేలు ధర కల్పించి ఆదుకోవాలి.

–వెంకటసుబ్బయ్య, రైతు, భీమునిపాడు, కోవెలకుంట్ల

ఏహెచ్‌ఓఏ జనరల్ సెక్రటరీకి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

డోన్: ఏపీ అనిమల్ హస్బెండరీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన డాక్టర్ రేపల్లె నాగరాజును డోన్ ప్రాంతీయ పశు వైద్యశాలలో సిబ్బంది బుధవారం సన్మానించారు. ఆయన ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు హుసేన్‌బాషా, హరీష్, ఏపీఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్ రఫీ, సభ్యులు నాగలక్ష్మిదేవి, నాయక్, రామాంజనేయులు, నవ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను క్రమబద్ధీకరించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

సంజామల: ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఎంపీడీఓ సాల్మన్‌కు వినతి పత్రం అందజేశారు. 19 ఏళ్ల సర్వీసును గుర్తించి క్రమబద్ధీకరించాలని, మండల యూనిట్‌గా భావించి అంతర్గత బదిలీలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ సభ్యులు రామయ్య, రవీంద్ర, బీబీ కాశీం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పర్యవేక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ పీడీ లీలావతి

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు ప్రతి రోజు తనిఖీ చేయాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లీలావతి అన్నారు. బుధవారం బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. బాలసంజీవని యాప్, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో వివరాలను పక్కాగా నమోదు చేయాలని, కొన్ని అంగన్‌వాడీ సెంటర్లు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. అలాంటి సెంటర్లలో యాప్‌పై అవగాహన కల్పించి బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టును జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంచేందుకు సూపర్‌వైజర్లు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు సాలమ్మ, శైలజ, చిట్టెమ్మ, జమిలా, సుగుణ, శాంతమ్మ, శివమ్మ పాల్గొన్నారు. అలాగే స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అద్దాకుల శ్రీనివాసులుపై పలువురు బుక్‌కీపర్ల ఆరోపణలు, ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు రహస్య విచారణ చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీప్రియ

బనగానపల్లె రూరల్: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త లక్ష్మీప్రియ అన్నారు. బుధవారం నందవరం అంగన్‌వాడీ కేంద్రం–2లో సూపర్‌వైజర్ జమిలా ఆధ్వర్యంలో పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు,బాలింతలతో పాటు చిన్నారుల పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీప్రియ మాట్లాడుతూ.. పౌష్టికాహారం లోపిస్తే రక్తహీనత ఏర్పడి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం లోపిస్తే వారిలో శారీరక, మానసిక ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. అలాగే పెరటితోటల ప్రాముఖ్యత, ఆరోగ్యంపై అవగాన కల్పించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి

ప్యాపిలి: కుష్టు, క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శారదా బాయి ఆదేశించారు. బుధవారం ప్యాపిలి పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారిణి వాణిశ్రీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. కుష్టు, క్షయ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. మందులు సక్రమంగా వాడుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న పలు కార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎంఓడీసీ పీటర్, పారా మెడికల్ ఆఫీసర్ హక్, ఫిజియో థెరపిస్టు శ్రీనివాసులు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పీఎంఏవై గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలోని పీఎంఏవై గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కో ఆప్షన్ మెంబర్ రసూల్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడుకు వినతిపత్రం అందజేశారు. జలదుర్గం గ్రామంలో 105 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గృహనిర్మాణాలు పూర్తి కావడంతో చాలా మంది లబ్ధిదారులు ప్రస్తుతం కాలనీలో నివాసం ఉంటున్నారని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ





అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్‌నాయక్, డోన్: గ్యాస్ మంటలను ఆర్పే విధానంపై అవగాహన

బనగానపల్లె రూరల్: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని బనగానపల్లె అగ్నిమాపకశాఖ అధికారి ఈశ్వర్‌నాయక్ అన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బుడగ జంగాల కాలనీ, అవుకుమెట్ట సర్కిల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఆయిల్, గ్యాస్ ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు.

గ్యాస్ లీకేజీలపై అవగాహన అవసరం

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ వాసన వస్తే ఇంటి కిటికీలు తెరవాలని, ఎలాంటి ఎలక్ట్రిక్ స్విచ్చులు వేయరాదని, రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే ఆర్పే పద్ధతులను మహిళల చేత ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రమోద్

కొలిమిగుండ్ల: గనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. బుధవారం సీఐ రమేష్‌బాబుతో కలిసి తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన మ్యాగజైన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బ్లాస్టింగ్ సమయంలో తీసుకుంటున్న సేఫ్టీపై ఆరాతీశారు. బ్లాస్టింగ్‌కు ఉపయోగించే సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. గనుల్లో పనిచేసే కార్మికులకు సేఫ్టీ పరికరాలపై ఆరా తీశారు. గనుల్లో బ్లాస్టింగ్ పనులను పరిశీలించారు. అనంతరం తిమ్మనాయినపేటలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించుకోవాలన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు

డోన్ టౌన్: రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టీఈ) యాక్ట్–2009 అనుసరించి ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 1వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలోని బలహీన వర్గాలకు 6శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



సంజీవనగర్ కాలనీలో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, ఎంపీపీ

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో నీటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడేవారు. సమస్యను కాలనీవాసులు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సొంత నిధులు వెచ్చించి యుద్ధప్రాతిపదికన గతంలో ఉన్న బోరు నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. బుధవారం తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, నాయకులు మురళీకృష్ణ, బుగ్గన చంద్రారెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్, మల్లికార్జున, ఆనంద్, నాగరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

ప్యాపిలి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండలంలో మొత్తం 21 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. సర్వసభ్య సమావేశానికి కనీసం 7 మంది హాజరైనా అధికారులు సమావేశాన్ని నిర్వహిస్తారు. ఉదయం 10:30కు ప్రారంభం కావాల్సిన సమావేశానికి మధ్యాహ్నం 12 గంటలైనా ఒక్క ఎంపీటీసీ సభ్యుడు కూడా హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తెలిపారు. అయితే మధ్యాహ్నం కూడా ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనాలు చెల్లించాలి –ఎంపీటీసీలు

సమావేశానికి గైర్హాజరైన ఎంపీటీసీ సభ్యులు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. దాదాపు 20 నెలలుగా తమకు రావాల్సిన గౌరవ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెలకు రూ. 3 వేల చొప్పున 20 నెలలకు గాను ఒక్కో ఎంపీటీసీ సభ్యుడికి ప్రభుత్వం రూ. 60 వేలు బకాయి పడిందన్నారు. తమపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. ఎంపీటీసీలకు నిధులు కూడా ఇవ్వకపోవడంతో స్థానికంగా తాము అభివృద్ధి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావాలని మూకుమ్మడి నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీటీసీ సభ్యులు మద్దయ్య, మదనశేఖర్, శేఖర్, శ్రీరాములు తదితరులు తెలిపారు. సభను గురువారానికి వాయిదా వేసినప్పటికీ తాము వెళ్లకూడదనే నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్



నాటుసారాను చూపుతున్న సీఐ వరలక్ష్మి, సిబ్బంది

డోన్ రూరల్: నాటుసారా అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డోన్ నియోజకవర్గంలో నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ప్యాపిలి మండలం కౌలుపల్లి గ్రామానికి చెందిన వడ్డె నాగరాజు, బూరుగుల గ్రామానికి చెందిన గజ్జి చంద్ర మద్దిలేటి, అలేబాద్‌తండా గ్రామానికి చెందిన ముదావత్ శ్రీరాంనాయక్ ఆయా గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వీరి వద్ద నుంచి 170 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ జయరాంనాయుడు, ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలావత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో మాట్లాడుతున్న ఎంఈఓలు

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పుస్తకాలు, డ్రస్సులు, బెల్టు, టై, షూస్ అమ్మరాదని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించుకోవాలని సూచించారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కూల్ బస్సులు, ఆటోలు మంచి కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాల ఫీజు వివరాలు నోటీసు బోర్డులో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అనుమతుల కోసం అన్ని పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి లీప్ యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలని సూచించారు.

వక్ఫ్ చట్ట సవరణ అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లింలు

బేతంచెర్ల: ముస్లింల హక్కులను కాలరాయడానికే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేసిందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలువురు ముస్లింలతో సమావేశం నిర్వహించారు. వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేసేందుకే ఈ సవరణ చేశారని ఆరోపించారు. ఈ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ముస్లింలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అల్తాఫ్ హుసేన్, ఆర్టీసీ అబ్దుల్లా, సాధిక్, రహంతుల్లా, శాలిబేగ్, ఖాజా, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీసుధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గురువారం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన శ్రీచక్ర హాస్పిటల్ సౌజన్యంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు.